సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం । 2 । డిసెంబర్ । 2024



సత్సంబంధాలుండాలి..
న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య సత్సంబంధాలు ఉండాలని ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ అన్నారు. - 8లో▸



పంట అవశేషాలను కాల్చొద్దు
వరి కోతల తర్వాత కొయ్యలతోపాటు గడ్డిని (అవశేషాలు) కాల్చడం వల్ల భూమికి తీరని నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.1°/23.2°
వాతావరణం
జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సరస్వతి పుష్కరాలపై నేడు సమీక్ష

కాళేశ్వరం: కాళేశ్వరంలో వచ్చే ఏడాది మే 15నుంచి 26వరకు జరిగే సరస్వతి నది పుష్కరాలపై దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో నేడు(సోమవారం) సమీక్ష నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం ఈఓ ఏ. మారుతి, ఆలయ ప్రధాన, ఉపప్రధాన అర్చకులు, పర్యాటక శాఖ అధికారులు పాల్గొననున్నారు. ఇప్పటికే ఆమె ఉన్నతాధికారులతో సెప్టెంబర్ 24న మొదటిసారిగా సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు, తాత్కాలిక, శాశ్వత ఏర్పాట్లపై చర్చ జరుగనుంది. కాళేశ్వరం ఒక్క చోటనే సరస్వతీనదికి పుష్కరాలు జరుగుతుండడంతో అన్ని రాష్ట్రాల నుంచి రోజుకు లక్షన్నరకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. నిధుల మంజూరుపై అధికారులు ప్రణాళికలు రూపొందించారు. నేటి సమీక్షలో పుష్కరాలపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అధికారికంగా సరస్వతీ నదీ పుష్కరాల తేదీని అర్చకులు ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపించగా, ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాకేశ్



రేగొండ: బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన కాడవేన రాకేశ్‌ను నియమించినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతి, రిజర్వేషన్ల కేటాయింపు, జాతి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షుద్రపూజల కలకలం



కాళేశ్వరం: నిత్యం మహదేవపూర్ ప్రాంతంలో క్షుద్రపూజలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అనారోగ్యం బారిన పడిన వ్యక్తులకు రోగం నయం చేస్తామని నమ్మించి మోసంచేసి డబ్బులు క్యాష్ చేసుకుంటున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జామువరకు అమావాస్య కావడంతో కొందరు క్షుద్రపూజలు చేశారని ఆనవాళ్లు దర్శనమిస్తున్నాయి. ఆదివారం తెల్లవారు జామున మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన కొంత మందికి కుదురుపల్లి వాగులో ఒక పొట్టేలు తల వేరు చేసి, గోధుమ పిండి, పసుపు, కుంకుమతో పాటు నిమ్మకాయల, కోడి గుడ్లు, వస్త్రాలు, కొబ్బరికాయలు కనిపించాయి. దీంతో భయాందోళనకు లోనయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి క్షుద్రపూజలు చేస్తుండడంతో తమ గ్రామానికి అరిష్టం ఏర్పడుతుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ఘనటలు ఇలా..
ఇటీవల కుదురుపల్లి అటవీప్రాంతంలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు క్షుద్రపూజలు చేయగా స్థానిక యువకులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పది రోజుల కిందట మహదేవపూర్ మండలకేంద్రంలో పోచిరెడ్డి అనే వ్యక్తి ఇంటి ఎదుట పసు పు, కుంకుమ, నిమ్మకాయలు, కోడి, గుడ్లు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. అదంతా వారి సీసీ కెమెరాలో నిక్షిప్తం అయింది. మండలంలో క్షుద్రపూజలు చేసి నయం చేస్తామని ప్రజలను మోసం చేసే వ్యక్తులు అటవీప్రాంతాలను ఎంచుకొని వేలల్లో డబ్బులు గుంజుతున్నారని తెలిసింది. గతంలో కాళేశ్వరం గోదావరి ప్రాంతాల్లో ప్రతీ అమావాస్యకు వరంగల్, పరకాల, భూపాలపల్లి, మంథని, మంచిర్యాల. చెన్నూర్ తదితర ప్రాంతాల నుంచి క్షుద్రపూజలు చేసేందుకు వచ్చేవారు. పోలీసులు వీరిపై దృష్టి సారించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పేలిన తూటా..

చెల్పాక అడవుల్లో ఎన్‌కౌంటర్

● గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్.. రహదారులపై తనిఖీలు ● గిరిజన గూడేల్లో భయం భయం



అప్పుడే చీకటి కొద్దికొద్దిగా తొలగిపోతోంది. సూర్యుడు తూర్పున ఉదయించడానికి సిద్ధమవుతున్నాడు. అప్పుడే తుపాకీ మోతలతో ఏటూరునాగారం చెల్పాక అడవులు దద్దరిల్లాయి. మావోయిస్టులు, స్పెషల్ పార్టీ పోలీసుల మధ్య జరిగిన ఎదురు కాల్పులతో పచ్చని అడవులు రక్తసిక్తమయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున వంటకు సిద్ధమవుతున్న తరుణంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. పీఎల్‌జీఏ వారోత్సవాలకు ముందు రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

– ఏటూరునాగారం





ఎన్‌కౌంటర్ స్థలం వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు

ఛత్తీస్‌గఢ్ నుంచి భూపాలపల్లి మహాముత్తారం మీదుగా మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు భద్రు అలియాస్ పాపన్న దళం ఏటూరునాగారం చెల్పాక అడవుల్లోకి చేరుకున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గట్టి నిఘా పెట్టారు. మంగపేట ఎస్సై నేతృత్వంలో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ దళాలు కూంబింగ్ చేపట్టాయి. శనివారం రాత్రి రెండు లారీల్లో పోలీసులు చెల్పాక అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. ఇదే క్రమంలో భద్రు దళం ఒక మహిళా సభ్యురాలు జమున, మిగతా ఆరుగురితో మూడు రోజుల క్రితం మకాం వేసి ఉన్నట్లు తెలుసుకున్నారు. మావోయిస్టులు అటవీ ప్రాంతంలో కూరగాయలు, పది కిలోల బియ్యం, ఇతర సామగ్రిని సమీప గ్రామాల్లోకి తెచ్చిపెట్టుకొని వంట చేసుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. రాత్రి సమయం కావడంతో చీకటిలో వీలుకాకపోవడంతో తెల్లవారు జామున వంట చేసుకునేందుకు పొయ్యి వెలిగించి ఇతర సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో ఎదురు కాల్పులు మొదలయ్యాయి.

ప్రతిఘటించి నేలకొరిగిన భద్రు..!
సెంట్రల్ కమిటీ సభ్యుడు భద్రు తన ఏకే–47 గన్‌తో పోలీసులపై సుమారు ఒక మ్యాగ్జిన్ బుల్లెట్ల వర్షం కురిపించి తప్పించుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నించి నేలకొరిగినట్లు సమాచారం. భద్రుతోపాటు ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు అడవిలో పడి ఉండగా.. మరో ముగ్గురి మృతదేహాలు పాలకమ్మవాగు సమీపాన లభించాయి. అయితే భారీ ఎన్‌కౌంటర్‌లో కీలక వ్యక్తులు మృతి చెందడంతో మావోయిస్టులకు ఎదురుదెబ్బతగిలింది.

ఎన్‌కౌంటర్ తర్వాత తుపాకీ మోతలు
ములుగు జిల్లా ఎస్పీ శబరీష్, డీఎస్పీ రవీందర్, బయ్యారం డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, కుమార్ ఆదివారం చెల్పాక అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగిన స్థలానికి చేరుకొన్నారు. అయితే ఎస్పీ బైక్‌పై వెళ్లి హతమైన మావోయిస్టుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ ఘటనా స్థలానికి చేరిన తర్వాత 11.47 గంటలకు రెండు రౌండ్లు, 11.49 గంటలకు మరో రెండు రౌండ్ల, మధ్యాహ్నం 12 గంటలకు మరో మూడు రౌండ్ల కాల్పులు వినిపించాయి. దీంతో మరికొంత మంది మావోయిస్టులు మృతి చెందారని అందరూ భయాందోళనకు గురయ్యారు. అయితే అసలు విషయం ఏంటంటే అక్కడ ఎలాంటి ఇబ్బంది, శత్రువులు లేరని, అందరూ రిలాక్స్ కావాలని సంకేతాలు ఇస్తూ.. కాల్పులు జరిపినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మావోయిస్టుల మృతదేహాలను ములుగు ఏరియా ఆస్పత్రికి ప్రత్యేక వాహనాల్లో తరలించారు.

వివరాలు సేకరించిన ఫోరెన్సిక్ బృందం

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మృతుల వివరాలు, ఆధారాలు సేకరించేందుకు ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలానికి చేరుకుంది. ప్రత్యేక వీడియోలు, ఫొటోలు చిత్రీకరిస్తూ అణువణువూ పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. మీడియాను సైతం ఘటనా స్థలికి అనుమతించలేదు. అంతేకాకుండా ఏటూరునాగారం తహసీల్దార్ జగదీశ్, ఆర్‌ఐ కిరణ్‌తోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన తహసీల్దార్లతో పంచనామా నిర్వహించారు.



ఎన్‌కౌంటర్ స్థలానికి వెళ్తున్న ఫోరెన్సిక్ నిపుణుడు

పోలీసులను చంపడానికి మావోల కాల్పులు : ఎస్పీ



ఎన్‌కౌంటర్ స్థలానికి వెళ్తున్న ఎస్పీ

వాజేడు మండలం పెనుగోలు కాలనీలో ఉయికె రమేశ్, ఉయికె అర్జున్‌ను మావోయిస్టులు హత్య చేసిన తర్వాత ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా పోలీస్ బృందం ఆదివారం ఉదయం 6.18 సమయంలో పాలకమ్మ అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తోంది. 12 నుంచి 13 మంది మావోలు స్పెషల్ పార్టీ పోలీసులను చూసి కాల్పులు ప్రారంభించారు. లొంగిపొమ్మని హెచ్చరించినా వినకుండా కాల్పులు జరపగా.. ఆత్మరక్షణ నిమిత్తం స్పెషల్ పార్టీ పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించగా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు ఎస్పీ శబరీష్ పేర్కొన్నారు.

ఆయుధాలు, సామగ్రి స్వాధీనం

ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కిట్ బ్యాగులు, విప్లవ సాహిత్యంతో పాటు కూరగాయలు, బియ్యం, బిస్కెట్లు, ఖారా మిక్చర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ డబ్బాలో ఉసిరికాయ పచ్చడి, దళాలు ఖర్చు చేసుకున్న నగదు వివరాల డైరీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలం నుంచి పారిపోయిన మిగతా మావోయిస్టులు లొంగిపోతే పునరావాసం కల్పించి అన్నివిధాలా ఆదుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ శబరీష్ చెప్పారు.



ఘటనా స్థలంలో లభ్యమైన సామగ్రి

ఏజెన్సీలో పోలీసుల తనిఖీలు ముమ్మరం..

కన్నాయిగూడెం: చెల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఏజెన్సీ గ్రామాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి ఎలాంటి అలజడులు లేకుండా ఉన్న పల్లెల్లో ఒక్కసారిగా ప్రశాంతత చెదిరిపోయింది. ఎన్‌కౌంటర్‌లో కొంత మంది మావోయిస్టులు తప్పించుకున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నారు. రహదారులపై తనిఖీలు ముమ్మరం చేశారు. ఏటూరునాగారం, తుపాకులగూడెం, పలిమెల, మహదేవపూర్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి వచ్చి పోయే వాహనాలను నిలిపి తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా.. తుపాకులగూడెంలోని తాల్లగడ్డ, లక్ష్మీపురం పడవ రేవు, అయ్యవారిపేట పడవ రేవుల వద్ద పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టి భద్రతను కట్టుదిట్టం చేశారు.



బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న చెల్పాక గిరిజనులు

కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు..
● నల్లా, ఎర్రం, శీలం యాదిలో ఏటా పీఎల్‌జీఏ వారోత్సవాలు - 8లో▸

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

విద్యా కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు

చిట్యాల: విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల–కళాశాల(బాలికల)ను ఆదివారం సందర్శించారు. ముందుగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, భోజనశాల, డార్మిట్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్ విద్యార్థుల తరగతి గదులలోకి వెళ్లి విద్యకు సంబంధించిన విషయాలను చర్చించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. చక్కటి వసతులు కలిగి ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతితో పాటు పాఠశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారిని సునీత, బీసీ డెవలప్‌మెంట్ అధికారిని శైలజ, ఎఫ్ఏఓ మధుసూదన్, సెక్టోరియల్ ఆఫీసర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాలు కల్పించాలి
టేకుమట్ల: విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని విశ్వేశ్వర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం తనిఖీ చేశారు. తరగతి గదుల్లోని విద్యార్థులతో మాట్లాడి భోజనం, విద్యపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. మెరుగైన విద్యను అందించాలని ఎస్ఓ స్వప్నకు తెలిపారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, బీసీ వెల్ఫేర్ అధికారి శైలజ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి సునీత, ఎఫ్ఏఓ మధుసూదన్, సెక్టోరియల్ అధికారి రాజగోపాల్ ఉన్నారు.



చిట్యాల: విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు

విద్యార్థులకు అసౌకర్యం కలగొద్దు..
కాటారం: గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు పీఎల్.విశ్వేశ్వర్‌రావు సూచించారు. కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, ఎస్సీ సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. కమిషన్ సభ్యుడి వెంట డీఈఓ రాజేందర్, బీసీ సంక్షేమాధికారిణి శైలజ, ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారిణి సునీత, ఎఫ్ఏఓ మధుసూదన్, సెక్టోరియల్ ఆఫీసర్ రాజగోపాల్, తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సుభాష్‌కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాలులో ఆదివారం ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ శర్మతో కలసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ పెంపు, 53 వేల ఉద్యోగాలు భర్తీ, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ పథకం అమలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను కళాకారులు నాటక, నృత్యాల రూపంలో ప్రదర్శించడం చాలా బాగుందని అభినందించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ. ఈ నెల 4వ తేదీన పెద్దపల్లి సభలో ముఖ్యమంత్రి గ్రూపు 4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేసే కార్యక్రమానికి జిల్లానుంచి 101మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఆర్ఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పక్కన కలెక్టర్ రాహుల్ శర్మ



కార్యక్రమంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

పోలీసుల విస్తృత తనిఖీ



మహదేవపూర్ మండలకేంద్రంలో..

కాళేశ్వరం: నేటి నుంచి ఈనెల 8వరకు వారం పాటు జరుగనున్న మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు ఓ వైపు.. ములుగు జిల్లా ఏటూర్‌నాగారం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ మరోవైపు ఈ నేపథ్యంలో మహదేవపూర్ పోలీసులు ఆదివారం విస్తత తనిఖీలు చేపట్టారు. ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి 353(సీ)పైన మహారాష్ట్రకు వచ్చిపోయే వాహనాలను నిలిపి తనిఖీ చేశారు. అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేశారు. వాహన ధృవీకరణ పత్రాలు లేనివారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి ప్రాంతాల్లో బలగాలు మోహరించాయి. ప్రత్యేక పోలీసు బలగాలతో కూంబింగ్ చేపట్టారు.

వాహన తనిఖీ
మల్హర్: నేటి (సోమవారం) నుంచి 8వ తేదీ వరకు పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని కొయ్యూరు స్టేషన్ ఆవరణలో ఆదివారం కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ వాహన తనిఖీ నిర్వహించారు. మంథని–కాటారం వైపు వెళ్తున్న వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు.

'విజయోత్సవాలకు' అసెంబ్లీ కోఆర్డినేటర్లు

● ప్రజాపాలన ఏడాది ఉత్సవాలకు ఇన్‌చార్జ్‌లు
● 12 మందిని నియమించిన టీపీసీసీ.. జిల్లా నుంచి పొరుగు నియోజకవర్గాలకు ఆరుగురు..
● తక్షణమే అమల్లోకి వచ్చిన ఆదేశాలు

సాక్షిప్రతినిధి, వరంగల్ : ప్రజా పాలన ఏడాది విజయోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అసెంబ్లీ కోఆర్డినేటర్‌లను నియమించింది. మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పలువురికి నియోజకవర్గ సమన్వయకర్తలుగా అవకాశం కల్పించింది. ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు వీరిని నియమిస్తూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా సీహెచ్.శ్రీనివాస్, స్టేషన్‌ఘన్‌పూర్(ఎస్సీ) ఎన్.భానుప్రకాశ్‌రెడ్డి, పాలకుర్తి చారగాని దయాకర్, డోర్నకల్(ఎస్టీ)కు మద్ది శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. మహబూబాబాద్(ఎస్టీ)కు బండి సుధాకర్‌గౌడ్, నర్సంపేట మహేశ్ కొనగాల, పరకాల రాయల నాగేశ్వర్‌రావు, వరంగల్ పశ్చిమ మాజీ విప్ ఆరెపెల్లి మోహన్‌లకు అసెంబ్లీ కోఆర్డినేటర్‌లుగా బాధ్యతలు అప్పగించారు. వరంగల్ తూర్పునకు మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వర్ధన్నపేట(ఎస్సీ) మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి, భూపాలపల్లి అద్దంకి దయాకర్, ములుగు(ఎస్టీ) కూచన రవళిరెడ్డి అసెంబ్లీ సమన్వయకర్తలుగా నియమితులయ్యారు. ఉమ్మడి వరంగల్ నుంచి టీపీసీసీ కార్యదర్శి ఈవీ శ్రీనివాస్‌రావును అశ్వారావుపేట(ఎస్టీ) నియోజకవర్గ సమన్వయకర్తగా, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని హుజూరాబాద్, ఆయిల్ సీడ్స్, గ్రోయర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని ఆలేరుకు, వరంగల్ మేయర్ గుండు సుధారాణిని వేములవాడ, దొమ్మాటి సాంబయ్యను కొత్తగూడెం, వెన్నం శ్రీకాంత్‌రెడ్డిని భద్రాచలం(ఎస్టీ) కోఆర్డినేటర్‌గా నియమించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కలుపుకుని విజయోత్సవ వేడుకలను జయప్రదం చేయడంతో వీరు కీలకపాత్ర వహించనున్నారు.

'రాజకీయ కుట్రలో భాగమే..'

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశంలో ఓటు బ్యాంకు రాజకీయాలు పరాకాష్టగా చేరుకున్నాయని, రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ అని తెలంగాణ నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు పొక్కూరి చిన్న రాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కులసమీకరణాలు చేస్తున్నారన్నారు.

గడపగడపకూ బీసీ ఉద్యమం

బీసీ ఇంటలెక్చువల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు

భూపాలపల్లి రూరల్: బీసీ ఉద్యమాన్ని రాష్ట్రంలోని బీసీల గడపగడపకు తీసుకెళ్తే రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారం వస్తుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు అన్నారు. బీసీ ఇంటలెక్చువల్ జిల్లా కమిటీ నాయకులు పైడిపల్లి రమేష్, దాసరి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని కాంట్రాక్ట్ అసోసియేషన్ కార్యాలయంలో బీసీ ఇంటలెక్చువల్ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధుకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు బీసీ కులాలకు చెందిన పెద్దలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. అనంతరంలో చిరంజీవులు మాట్లాడుతూ 61శాతం బీసీ జనాభా ఉండి రాష్ట్రంలో రాజ్యాధికారం అందుకోలేకపోవడం బాధాకరమన్నారు. 77 సంవత్సరాలుగా రాష్ట్రంలో బీసీలు రిజర్వేషన్లు కోల్పోయారన్నారు. జనాభా ప్రతిపాదికన బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే వేల మంది బీసీ బిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు బీసీ అభ్యర్థులకు ఓటు వేయాలని, అగ్ర కులస్తులకు ఓటు వేసి వాళ్ల మోచేతి నీళ్లకు ఆశ పడవద్దన్నారు. బీసీలం ఏ రాజకీయ పార్టీలో ఉన్నా బీసీ అభ్యర్థికే ఓటు వేయాలన్నారు. 'మన ఓటు మనకే' అనే నినాదంతో ముందుకెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ కులస్తులమంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గాజర్ల అశోక్, బీసీ సంఘాల నాయకులు శ్రీపతి ప్రభాకర్, చంద్రగిరి శంకర్, తాటి వెంకటేశ్వర్లు, స్వామి, క్యాతరాజ్ సాంబమూర్తి, వున్నం రవి, శేఖర్ నాని, గోవర్ధన్, సంపత్, వెన్నంపల్లి పాపయ్య, రాజేందర్, మహిళా, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిరంజీవులు

'సాట్ క్యూ' టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన


టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

హన్మకొండ అర్బన్: వడ్డేపల్లిలోని ఎస్ఆర్ ఎడ్యు సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన 'సాట్ క్యూ' (ఎస్ఆర్ అకాడమీ టాలెంట్ క్వెస్ట్) టెస్ట్‌కి విశేష స్పందన లభించినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. ఈ టెస్ట్ ద్వారా విద్యార్థులకు వారి ప్రతిభానుసారంగా ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే మంచి విద్య అవసరమని, అందులో ఇంటర్మీడియట్ విద్య చాలా కీలకమన్నారు. ఈ టెస్ట్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత అవకాశాలు పొందడమే కాకుండా దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, సీఈఓ, జోనల్ ఇన్‌చార్జ్‌లు, సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

బ్లూఫోర్స్ ఆర్మీలో పనిచేసిన జవాన్‌కు స్వాగతం


హథీరాంకు స్వాగతం పలుకుతున్న మాజీ సైనికులు

బయ్యారం/ మహబూబాబాద్‌రూరల్: ఐక్యరాజ్యసమితి పరిధిలోని బ్లూఫోర్స్ ఆర్మీలో తొమ్మిది నెలలు పనిచేసి స్వగ్రామానికి వస్తున్న జవాన్ హథీరాంకు ఆదివారం రైల్వేస్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. బయ్యారం మండలం ఉప్పలపాడుతండాకు చెందిన హథీరాం 2016లో ఆర్మీలో చేరారు. యూనిటైడ్ నేషన్ ఆర్గనైజేషన్(ఐక్యరాజ్యసమితి) అనుబంధ బ్లూఫోర్స్ ఆర్మీకి దేశవ్యాప్తంగా 162 మంది జవాన్లు ఎంపిక కాగా తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. ఇందులో హథీరాం ఒకరు కాగా తొమ్మిది నెలల పాటు హథీరాం ప్రపంచంలోని పలు దేశాల్లో సేవలు అందించారు. సేవలు పూర్తి చేసుకుని మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆయనకు మాజీ సైనిక ఉద్యోగులు సత్యనారాయణ, గణేశ్, నగేశ్, ఈఎంఆర్ఎస్ క్రీడల అధికారి వీర్యనాయక్, తైక్వాండో కోచ్ రాంబాబు నాయక్, పీఈటీ కిషన్‌నాయక్, కరాటే కోచ్‌లు వీరునాయక్, సాయి స్వాగతం పలికారు.

కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు 25 ఏళ్లు..

- నల్లా, ఎర్రం, శీలంల యాదిలో ఏటా పీఎల్‌జీఏ వారోత్సవాలు
- నేటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహణ..
- జిల్లాలో అప్రమత్తమైన పోలీసులు

మల్హర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు నేటితో 25 ఏళ్లు నిండాయి. 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అప్పటి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి అలియాస్ శ్యామ్, ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి అలియాస్ మహేశ్, ఉత్తర తెలంగాణ కార్యదర్శి శీలం నరేశ్ అలియాస్ మురళితో పాటు లక్ష్మీరాజం అనే సాధారణ పౌరుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. నాటి పరిస్థితుల దృష్ట్యా ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో నక్సల్స్ ప్రాబల్యం బలంగా ఉండేది. అలాంటి సమయంలోనే నక్సల్ ముఖ్య నేతలు మరణించడం ఉద్యమానికి తీవ్ర దెబ్బగా భావిస్తారు. ఈ నేపథ్యంలో వారికి గుర్తుగా డిసెంబర్ 2 నుంచి 8వ తేదీవరకు మావోయిస్టులు ఏటా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా ప్రతి సంవత్సరం భారీ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

ఎన్‌కౌంటర్ నేపథ్యం..

అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూరు అటవీ ప్రాంతంలో 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి మృతి చెందారు. అప్పటి హోం శాఖ మంత్రి దేవేందర్ గౌడ్, డీజీపీ దొర హెలికాప్టర్‌లో కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా ఎన్‌కౌంటర్ ప్రదేశాన్ని సందర్శించారు.

సిద్ధాంతాలకు ఆకర్షితులై అజ్ఞాతంలోకి..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో హుజూరాబాద్ మండలం కొత్తగుట్టకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేశ్, వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి ఉన్నత విద్యాభ్యాసం చేశారు. తల్లిదండ్రులను వదిలి నక్సల్ సిద్ధాంతాలకు ఆకర్షితులై అజ్ఞాతంలో ఉంటూ ప్రజా ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. అంకితభావంతో పనిచేస్తూ పార్టీ కేంద్ర కమిటీ నాయకుల స్థాయికి ఎదిగారు. రెండు దశాబ్దాలు విప్లవోద్యమంలో పని చేసిన నాయకులు ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

బేగంపేటలో స్తూపం ఏర్పాటు..

నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, ఎర్రం సంతోశ్‌రెడ్డి త్యాగానికి చిహ్నంగా నాటి పీపుల్స్‌వార్(మావోయిస్టు) పార్టీ ప్రథమ వర్ధంతి సందర్భంగా పీఎల్‌జీఏ(పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) సైనిక బలగాన్ని ఏర్పాటు చేసుకుంది. దీంతో ప్రతి సంవత్సరం డిసెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు పీఎల్జీఏ వారోత్సవాలు నిర్వహిస్తూ వస్తోంది. వీరి స్మారకంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామాల్లో మావోయిస్టు పార్టీ నాయకులు 53 అడుగుల ఎత్తైన స్తూపాన్ని నిర్మించారు. ఈ స్తూపాన్ని 2005, నవంబర్ 13న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆవిష్కరించారు.


పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేటలో ఏర్పాటు చేసిన స్మారక స్తూపం



పీజీఏ ఆవిర్భావం..

కొయ్యూరు మృతుల స్మారకార్థం వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా పీపుల్స్ గెరిల్లా ఆర్మీ (పీజీఏ)ని 2000 డిసెంబర్ 2న అధికారికంగా ప్రకటించింది. ఇది సైనిక విభాగంగా పని చేస్తూ శత్రువులపై దాడులు చేయడానికి, పార్టీ ఆత్మరక్షణ కోసం పని చేయడానికి ఏర్పాటు చేసుకున్నారు.

సామాన్య కార్యకర్తల స్థాయి నుంచి..

మల్హర్ మండలం కొయ్యూరులో 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, ఎర్రం సంతోశ్‌రెడ్డి మృతి చెందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం కొత్తగుట్టకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేశ్, వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి సామాన్య కార్యకర్తలుగా పీపుల్స్‌వార్‌లో చేరి కేంద్ర కమిటీ నాయకుల స్థాయికి ఎదిగారు.

ఆ.. 33 మంది ఎక్కడ?

- ములుగు జిల్లాలో నమోదైన మిస్సింగ్, కిడ్నాప్ కేసుల్లో ఇంకా లభించని ఆచూకీ
- యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫిర్యాదుపై ఆర్టీఐలో వెల్లడించిన డీజీపీ కార్యాలయం

ములుగు: మానవ అక్రమ రవాణా, కిడ్నాప్‌లు, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు శాఖ చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న నిజనిర్ధారణకు పొంతనలేకుండా పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ములుగు జిల్లాలో 2020 జనవరి నుంచి 2024 అక్టోబర్ నెల వరకు మిస్సింగ్ అయిన కేసుల విషయంలో యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ తరఫున రైట్ ఇన్‌ఫర్మేషన్ యాక్ట్ (ఆర్టీఐ) వేసిన ఫిర్యాదు ఆధారంగా జిల్లా వాసులకు తెలియని సంచలన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 539 మంది మిస్సింగ్, కిడ్నాప్ అయినట్లు రాష్ట్ర డీజీపీ కార్యాలయం వివరాలు వెల్లడించింది. ఇందులో ఇప్పటి వరకు 506 మంది ఆచూకీ లభించగా వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతా 33 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదని వెల్లడించింది.

2020 జనవరి నుంచి నమోదైన బాలుర మిస్సింగ్ కేసులు 22. ఇందులో 21 కేసులను పోలీసులు ఛేదించారు. బాలికల మిస్సింగ్ కేసులు 140. ఇందులో ఛేదించినవి 138. మహిళల మిస్సింగ్ కేసులు 263. ఇందులో 255 ఛేదించారు. పురుషుల మిస్సింగ్ కేసులు 114. ఛేదించినవి 92 ఉండగా మిగతా వారు ఏమయ్యారనే అంశం ఇప్పటి వరకూ జాడలేకుండా పోయింది.

బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాలి



పోలీసు శాఖ పనితీరు గొప్పదే. అయితే తప్పిపోయిన వారి వివరాలు తెలియకపోతే ఆ కుటుంబాలు అనుభవించే బాధ తలుచుకుంటే కన్నీళ్లు వస్తున్నాయి. ములుగు జిల్లాలో తప్పిపోయిన వారి వివరాలు తెలుసుకుని ఆ కుటుంబాలకు భరోసా ఇవ్వాలి. మిస్సింగ్ అయిన వారి ఆచూకీ తెలుసుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆచూకీ తెలియని వారి వివరాలు త్వరలో తెలుపుతాం.

-పల్నాటి రాజేంద్ర, యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : భార్య చనిపోయిందనే మనస్తాపంతో ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నర్సంపేట పోలీస్ క్వార్టర్స్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రవి కుమార్ కథనం ప్రకారం.. నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఏనుగుల రవి తండ్రి మొగిళి (65) తన భార్య సుభద్ర నాలుగు నెలల క్రితం కేన్సర్‌తో మృతి చెందింది. రేపు (సోమవారం) సుభద్ర నాలుగో మాసికం ఉంది. అయితే భార్య చనిపోయినప్పటి నుంచి మొగిళి మనస్తాపం చెందుతున్నాడు. కుమారుడు రవి, కోడలు ఎంత నచ్చచెప్పినా దిగాలుతోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బాత్రూంలోకి వెళ్లి ఐరన్ రాడ్‌కు కరెంట్ వైర్‌తో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే ఉరితాడు తప్పించి గిళిని 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఆసరా అవుతాడనుకుంటే ఆగం చేసిండు!

- రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కొడుకు మృతి
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు, బంధువులు


కల్యాణ్ (ఫైల్)

లింగాలఘణపురం : చేతికందిన కొడుకు ఆసరా అవుతాడని అనుకుంటే ఆగం చేసిండంటూ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మండల కేంద్రానికి చెందిన గండి అంజయ్య, రేణుక దంపతుల కుమారుడు కల్యాణ్ (22) గత నెలలో యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన తన స్నేహితుడు దేవరాయ కరుణాకర్‌తో కలిసి గత నెల 25న భువనగిరి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వంగపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కల్యాణ్‌కు తీవ్ర, కరుణాకర్‌కు స్వల్ప గాయాలు కాగా పోలీసులు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. కల్యాణ్ కోమాలోకి వెళ్లాడు. ఐదు రోజులు చికిత్స పొందినా ఫలితం లేదు. శనివారం రాత్రి మృతి చెందాడు.

ఫ్యాషన్ షోలపై మక్కువ

కల్యాణ్‌కు ఫ్యాషన్ షోలపై మక్కువ. 2023లో నడఫ్ ప్యాషన్ షో అడిషన్స్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో కల్యాణ్ భువనగిరికి ఎందుకు వెళ్లాడో ఏమో తెలియదు. ప్రమాదంలో గాయపడ్డాడని సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రిలో కోమాలో ఉన్న కొడుకును చూసి తల్లడిల్లారు. ఏదైనా పని చేసి తమకు అండగా ఉంటాడని భావించిన తల్లిదండ్రుల ఆశలు నిరాశలయ్యాయి. తాము ఇష్టంగా కొనిచ్చిన బైక్‌తో ప్రమాదం జరిగి మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్: ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 3వ డివిజన్ పైడిపల్లి శివారులో పేకాట శిబిరంపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ శిబిరంలో 12 మంది పేకాట ఆడుతుండగా పోలీసులు ఆరుగురిని పట్టుకోగా మరో ఆరుగురు పరారయ్యారని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో అంబి సంపత్(కాశిబుగ్గ), కుతాటి మధు (తూర్పు కోట), అబ్దుల్ రెహమాన్(దేశాయిపేట), తిల్పితియా సత్నామ్‌సింగ్(ఎంహెచ్‌నగర్), సంగెపు రాజేశ్(లేబర్ కాలనీ), ఉప్పుల అనిల్(ఎస్ఆర్‌నగర్) ఉన్నారన్నారు. పరారైన వారిలో వరంగల్‌కు చెందిన శివ, మంతెన రాజేందర్, రఘు, మహేశ్, షకీల్, సంపత్ ఉన్నారని తెలిపారు. రూ.10,600 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఏనుమాముల పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ వివరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్, ఏనుమాముల ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పంట అవశేషాలను కాల్చొద్దు

- వరి కొయ్యలు, గడ్డికి నిప్పు పెట్టొద్దు
- నిప్పుతో భూమికి తీరని నష్టం
- పొలంలో కలియదున్నితే భూసారం పెంపు

  
డాక్టర్ ఎస్.మాలతి బి.క్రాంతికుమార్ డీఏఓ విజయనిర్మల

మహబూబాబాద్ రూరల్: వరి పంట కొనుగోలు కేంద్రాలకు వస్తుండగా, మరికొద్ది రోజుల్లో యాసంగి పనులు మొదలు కానున్నాయి. ఈ నేపథ్యంలో వరి కోతల తరువాత రైతులు కొయ్యలతోపాటు గడ్డిని (అవశేషాలు) కాల్చుతారు. అయితే ఇలా చేయొద్దు. అవశేషాలు కాల్చడం వల్ల భూమికి తీరని నష్టం వాటిల్లుతుంది. పొలంలో కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుందని మహబూబాబాద్ డీఏఓ ఎం.విజయనిర్మల, మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ అన్నారు. వరి కొయ్యలు, గడ్డికి నిప్పు పెట్టడం వల్ల సూక్ష్మ జీవులు, మిత్ర పురుగులు చనిపోతాయని, భూసారం దెబ్బ తిని భూమికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు.


వరి కోతల అనంతరం కొయ్యలు, గడ్డికి నిప్పు పెట్టగా ఎగసిపడుతున్న మంటలు

ఒక్కసారి కాల్చడం వల్ల వ్యవసాయం 20 ఏళ్ల వెనక్కి..

- కొయ్య కాళ్లను తగలబెట్టడం వల్ల వ్యవసాయానికి మేలు జరగదు
- వాతావరణంలో కాలుష్యం పెంచుతుంది.
- ఒక్కసారి కొయ్య కాళ్లను కాల్చడం వల్ల వ్యవసాయం 20 ఏళ్ల వెనకబడినట్లే.
- మట్టిలో కోట్లాది సూక్ష్మజీవులు ఉంటాయి. ఇందులో పంటలకు మేలుచేసే మిత్రపురుగులు కూడా ఉంటాయి.
- కొయ్య కాళ్లను తగులబెట్టినప్పుడు ఇవన్నీ చనిపోతాయి. తద్వారా భూమి సారం కోల్పోతుంది.
- రోటోవేటర్‌తో దున్నడం వల్ల కొయ్య కాళ్లను చిన్న ముక్కలుగా, పొడర్‌గా మారుస్తుంది.
- తరువాత రెండు బస్తాలు సూపర్ వేసి దున్నితే భూమి సారవంతంగా మారుతుంది. దీంతో ఎకరాకు 10 ట్రాక్టర్ల మట్టి వేసినట్లు అవుతుంది. భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

కలియ దున్నితే ఎన్నో ప్రయోజనాలు..

- వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 10 శాతం పెరిగే అవకాశం ఉంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.
- కలియ దున్నితే ఎకరాకు దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని (యూరియా), నాలుగు శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.
- జింకు, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మ దాతువులు పంటకు మేలు చేకూరుస్తాయి.
- నేలలో కరగని మూలకాలను మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.
- కొయ్య కాళ్లను భూమిలో కలియ దున్నితే, గడ్డి ద్వారా పోషకాలన్నీ తిరిగి నేలకు చేరుతాయి.

గడ్డిని కాల్చితే కాలుష్యం..

- వరి కొయ్యలను తగులబెడితే ఎన్నో అనార్థాలు జరుగుతాయి.
- నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించడమే కాకుండా భూసారం తగ్గిపోతుంది.
- మట్టిని కాపాడుకోవాలంటే కొయ్య కాళ్లను కాల్చకపోవడమే మంచిది.
- గడ్డిని కలియ దున్నినా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- భూసారంతోపాటు దిగుబడులు పెరిగి రైతులకు మేలు జరుగుతుంది.
- వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో భూమిసారాన్ని కోల్పోతుంది.
- ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దిగుబడి తగ్గుతుంది.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, తొండలు, ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది.
- ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది.
- గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కొసారి వేడికి బుగ్గిపాలవుతున్నాయి.
- వరి కొయ్యలు, గడ్డిని తగులబెట్టిన సమయాల్లో ఓ రైతు భూమి పక్కనే ఉన్న మరో రైతు భూములకు అనుసంధానంగా ఉండే మొక్కలు చనిపోయే అవకాశం ఉంది.

న్యాయమూర్తులు, న్యాయవాదుల మధ్య సత్సంబంధాలుండాలి

- ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్

నయీంనగర్: కోర్టుల్లో న్యాయమూర్తులు, న్యాయవాదులకు సత్సంబంధాలు ఉండాలని, అప్పుడే బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. హనుమకొండ హరిత హోటల్‌లో జరుగుతున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఏఎల్) తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో రెండో రోజు 'న్యాయమూర్తులు, న్యాయవాదుల సంబంధాలు - వృత్తిపరమైన నైతిక విలువలు' అనే అంశంపై ఆదివారం జరిగిన సదస్సుకు ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కోర్టుల్లో కొత్తగా చేరిన న్యాయవాదులకు సీనియర్ న్యాయవాదులు మార్గదర్శకం చేయాలని, చట్టాలపై వస్తున్న తీర్పులపై న్యాయవాదులు పట్టు సాధించాలన్నారు. లాయర్లు విషయ అవగాహన, వాదనా పటిమను పెంచుకుని వృత్తిలో రాణించాలన్నారు. కోర్టుల గౌరవం కాపాడేలా లాయర్లు వ్యవహరించి బాధితులకు సకాలంలో న్యాయం అందించాలన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్. రమేశ్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కుల గురించే మాట్లాడుతున్నారు కాని తమ బాధ్యతలు గుర్తించడం లేదన్నారు. లాయర్లు వాయిదాలు కోరడం మాని బాధితుల వైపు నిలబడాలని సూచించారు. హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నిర్మాల గీతాంబ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు ఆందోళనకరమని, న్యాయవ్యవస్థ విలువలు ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. లాయర్లు రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో సైనికుల వంటి వారన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్. సురేశ్, జార్ఖండ్ బార్ కౌన్సిల్ సభ్యుడు రషీద్, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు ఎం.ఆదిరెడ్డి, జయ శ్రీనివాస్, నాయకులు ఏపీ.కృష్ణారావు, బొమ్మగాని శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్, బీమనాథం శ్రీనివాస్, కేవీఎల్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్

అంతర్జాతీయ పోటీలకు అంపైర్‌గా రాజేందర్



కేసముద్రం: అసోంలోని గౌహతిలో ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు యెనెక్స్ సన్‌రైజ్ గౌహతి మాస్టర్స్ బ్యాడ్మింటన్ (అంతర్జాతీయ) పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కేసముద్రం స్టేషన్ జెడ్పీహైస్కూల్ పీడీ కొమ్ము రాజేందర్ అంపైర్‌గా ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రమేశ్‌కుమార్, రమేశ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనుమానం.. పెనుభూతమైంది

- భార్యను ఉరివేసి చంపిన భర్త
- హత్యచేసి..ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణ
- కేసముద్రంలో ఘటన


అనూష(ఫైల్)

కేసముద్రం: అనుమానం.. పెనుభూతమైంది. ఓ ప్రబుద్ధుడు భార్యను ఉరివేసి హత్యచేశాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం .. కేసముద్రంస్టేషన్‌కు చెందిన బత్తుల వీరన్నకు ఇదే మండలం బోడమంచ్యాతండాజీపీకి చెందిన అనూష(30)తో 2011లో వివాహం జరిగింది. ఈ దంపతులకు కుమారుడు రాజేశ్(6వ తరగతి) ఉన్నాడు. మొదట్లో వారి దాంపత్య జీవితం సవ్యంగానే సాగింది. కొంతకాలంగా వీరన్న తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. పలుమార్లు ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. నాలుగు రోజుల క్రితం అనూష కుమారుడు రాజేశ్ బోడమంచ్యాతండాలో తన తాత ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి వీరన్న తన భార్య అనూషను ఉరివేసి హత్య చేశాడు. అనంతరం ఇంటి వెనక ఉన్న బావి దూలానికి భార్యను వేలాడ దీసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించాడు. ఆపై అక్కడి నుంచి పరారయ్యాడు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఘటనా స్థలికి చేరుకుని అనూష మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. అనూషను భర్తే హత్య చేశాడంటూ ఆరోపించారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు సిబ్బందితో చేరుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరన్న.. అనుమానంతోనే భార్య మెడకు ఉరేసి చంపిన అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.


తల్లికి తలకొరివి పెడుతున్న కుమారుడు రాజేశ్

తల్లికి తలకొరివి పెట్టిన చిట్టి చేతులు..

ఒకవైపు తల్లి హత్యకు గురికాగా, మరోవైపు తండ్రి లేకపోవడంతో దీనంగా కూర్చున్న చిన్నారి రాజేశ్‌ను చూసిన వారంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. తన చిట్టి చేతులతో తల్లికి తలకొరివిపెట్టి అంత్యక్రియలు పూర్తి చేశాడు. ఈ హృదయ విదారకర ఘటనను చూసిన ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టుకున్నారు.